నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మూసాపేట: బాలాజీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు బాలాజీనగర్, వివేక్ నగర్, పీపుల్స్ హాస్పిటల్ వెనుక ప్రాంతం, కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్, హెచ్ఎండబ్ల్యూఎస్ వాటర్‌వర్క్స్ కార్యాలయం, ఆంజనేయ నగర్, మూసాపేట, సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ప్రగతినగర్, సాయిబాబా ఆలయం, వసుంధర ఆసుపత్రి 4 నుంచి 5 గంటల వరకు బాలాజీనగర్, సాయిబాబా ఆలయం, రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం బాలానగర్‌కు చెందిన విష్ణు సాగర్‌కు రూ.2 లక్షలు, అల్లాపూర్‌కు చెందిన ఫయాజ్‌షేక్‌కు రూ.2 లక్షలు, ఇతర పది మంది మంది లబ్ధిదారులకు రూ. 4.37 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు.

నాలా పూడికతీత పనుల పరిశీలన



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీలకు ఆనుకొని ఉన్న నాలాలో పూడికతీత పనులను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలా పూడిక తీత పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏఈ రాధాకృష్ణ, శశిధర్, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ నిర్మాణం పూర్తి చేయాలి

- అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: వర్షాకాలానికి ముందే వరదనీటి కాలువల నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్‌లతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలానగర్, ఫతేనగర్, అల్లాపూర్, బాలాజీనగర్, కేపీహెచ్‌బీకాలనీ ప్రాంతాల్లో పనుల పూర్తికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఫతేనగర్ వద్ద ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణం త్వరగా చేపట్టాలన్నారు. నిధుల కొరత పేరుతో గతంలో చేపట్టిన అనేక పనులను పెండింగ్‌లో పెట్టారని, వాటిని సత్వరం చేపట్టాలని ఆయన అన్నారు. వీధి దీపాల నిర్వహణ గాలికి వదిలేశారని, రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సీసీ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టాలన్నారు. సమస్యలపై స్పందించిన కమిషనర్..కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి ఎమ్మెల్యే సూచించిన పనులకు సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని, అందుకు అవసరమయ్యే నిధులను కూడా మంజూరు చేయాలని సూచించారు. వారం రోజుల్లో వీధి దీపాల సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అదనపు అంతస్తులను మాత్రమే సీజ్ చేయండి

నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాల పేరుతో సుమారు 44 భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారని ఎమ్మెల్యే కృష్ణారావు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు తెలిపారు. అనుమతులు ఉన్న ఫ్లోర్లను ఏ విధంగా సీజ్ చేస్తారని ప్రశ్నించారు. పక్క నియోజకవర్గంలో అనేక కాలనీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా జీరో పర్మిషన్ భవనాలు ఉన్నాయని, వాటిని వదిలేసి అనుమతులు తీసుకున్న భవనాలను సీజ్ చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. స్పందించిన కమిషనర్.. అనుమతులు ఉన్న వాటిని సీజ్ చేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, సబిహా బేగం, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్‌లు మాధవరం రంగరావు, బాబూరావు పాల్గొన్నారు.

4,780 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు రైతుల నుంచి 4,780 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్‌లతో ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. మంత్రులు మాట్లాడుతూ.. 2023 రబీ సీజన్‌లో మే15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే.. ఈ రబీ సీజన్‌లో అదే మే 15 నాటికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు ముందెన్నడూ లేని విధంగా చేపట్టామన్నారు. ధాన్యం కొనుగోలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ జిల్లా నుంచి జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ హరిప్రియ, జిల్లా సివిల్ సప్లై జీఎం సుగుణబాయి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులకు ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

అల్విన్‌కాలనీ: మేడ్చల్ జిల్లాకు చెందిన ఆర్యవైశ్య విద్యార్థులు ప్రతిభా అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఈ నెల 25 లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9703050009 సురేష్‌ను సంప్రదించాలని తెలిపారు.



బాలానగర్ డివిజన్ నవజీవన్ నగర్‌లో నిర్వహించిన లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠలో మాధవరం కాంతారావు, అసోసియేషన్ సభ్యులు, నాయకులు. - కూకట్‌పల్లి

టాడ్ ఏరోస్పేస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్



భిక్షాటన చేస్తున్న సీఐటీయూ నాయకులు

బాలానగర్: ప్రశాంత్‌నగర్‌లోని టాడ్ ఏరోస్పేస్ కంపెనీ కార్మికులకు లేబర్ అధికారులు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ కోరారు. యాజమాన్యం తీరును నిరసిస్తూ పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం భిక్షాటనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీలో దాదాపు 12 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులు.. తమ జీతాలు పెంచాలని యాజమాన్యాన్ని అడిగినా స్పందించడం లేదన్నారు. యూనియన్ ఏర్పాటు చేసినందుకు కక్షగట్టి కార్మికులను బదిలీ చేస్తామని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, గణేష్, రహీమ్, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ అధికారులు నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, పట్నం సునీతా మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పాల్గొని సభ్యులను అభినందించారు. నూతన కమిటీ సభ్యులుగా మాధవరం శ్రీనివాసరావు, మేకల సుదర్శన్, కృష్ణారావు, గుత్తికొండ వెంకట్‌రావు, చెదురుపల్లి శ్రీనివాస్, అంకెనపల్లి రాము, రాజుయాదవ్, మునలి బాలరాజ్, అరిగే శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, కృష్ణవేణి, విద్యాకల్పన, బాషిపాక నాగమణి, యంజాల సుజాత ప్రమాణ స్వీకారం చేశారు.

సన్మానించిన నేతలు

ఆలయ కమిటీ సభ్యులను బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సన్మానించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో హనుమంతరావు, అర్శనపల్లి సూర్యారావు, యాంజాల పద్మయ్య, శ్రీకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- సొసైటీల పేరుతో వసూళ్లు చేయొద్దు
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో మౌలిక వసతులను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం బహదూర్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ సముదాయంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల నుంచి సొసైటీ సభ్యులు డబ్బులు వసూలు చేయడం తగదని, ప్రభుత్వం అన్ని వసతులను ఉచితంగా సమకూర్చుతుందన్నారు. గృహ సముదాయంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నోటీసులతో ఆందోళన చెందవద్దని, సదరు నోటీసులకు రిప్లై లెటర్ రాసి సంబంధిత అధికారుల ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బహదూర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సాదు యాదవ్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

